# మంచుకురిసిన రాత్రి

ఆ రాత్రి వాళ నాకు నిద్రపట్టలేదు.

హోటల్ నుంచి భోజనంచేసి వస్తూ యెంతెంతగానో ఆలోచించాను. దూరంగా రైలుపట్టాలు వెన్నెల్లో మెరిసిపోతున్నాయి. చెక్కలబ్రిడ్జిదగ్గర వాటర్ పంపు స్టేషన్ పక్కనవున్న చిటికేశ్వరపు చెట్టువెన్నెల్లో మరీ నల్లగావుంది. పుట్టినప్పటినుంచీ పొగ పోసుకుని దానికి అవతారం నల్లగా తయారైంది. పువ్వులుకూడా పొగ పూసుకుని నల్లగా వుంటాయి. దూరంగా తుంపుల గుంపుల కొండలు. వెన్నెల్లో మెరిసిపోతున్నాయి. ఆ వేపు రైలుపట్టాలు పల్లంలోకి పోతాయి. బెంగుళూరు వేపు ప్రయాణం చేయాలంటేఆ వేపేపోవాలి. వందయేళ్ళ నాటి చర్చి వెన్నెలలో నిశ్చలంగా యేమిటేమిటో మనసుకి చెపుతుంది దాని వేపుచూస్తే.

ఈవైపూ ఆవైపూ రైల్వే క్వార్టర్సు.

సాయంకాలంపూట అదంతా తిరిగి వచ్చాను.

ఆ పచ్చగన్నేరుపూలఇంట్లోవున్న అమ్మాయంటే నాకు ఇష్టం.

ఎందుకంటే యెప్పుడూ క్లాసులో గోల చేయదు.

చాలాబుద్ధిమంతురాలు. మంచిమార్కులు వస్తాయి.

సాయంకాలంపూట వాళ్ళింటివద్ద కాసేపు నిలుచున్నాను.

కాని ఆ అమ్మాయిమాత్రం నాక్కనిపించలేదు.

సాయంకాలపు ఎఱ్ఱటి కాంతులుపడి పచ్చగన్నేరుపూలు మెరిసిపోతున్నాయి. నాకు యెన్నాళ్ళకైనా గుర్తుంటాయి. పచ్చగన్నేరుపూలూ, ఆ అమ్మాయి.

మనసులో అనిపించినా యెక్కువసేపు నిలుచోలేదు.

ఎవరైనా పిల్లలుచూస్తే బావుండదు.

ఏంచూస్తే! ఇక నేను క్లాసులకు పోనవసరం లేదు.

అయిపోయింది. ప్రొద్దున్నే ఊరికి పోతున్నాను.

మళ్ళీ యీ వేపుకి రాను. వచ్చినా యీ మనుష్యులుండకపోవచ్చును.

అవును క్షణక్షణం మారుతుంది జీవితం.

పదిరోజులు ఏదైనా వూరికిపోయివస్తే పెరట్లో నాలుగు కొత్తిమొక్కలు కనిపిస్తే యెంతో మార్పు కనిపిస్తుంది.

మనముండేదే ఏదేనా కొత్తిమొక్క పుట్టి పెరిగి పువ్వులుపూసినా మనకా మార్పు గ్రాహ్యంకాదు.

అలానే ఎన్నాళ్ళు గడచినతర్వాతనో నేను ఇక్కడికివచ్చినా నేను వూహించలేని మార్పులు కలుగవచ్చును.

రైల్వే డిస్పెన్సరీ వెన్నెల్లో మెరిసిపోతున్నది.

చర్చిముందుకొచ్చేసరికి నలుగురు పిల్లలు జట్టుగాచేరి 'నమస్కారంసార్' అన్నారు. వాళ్ళ వేపు చూసీచూడనట్లు చూశాను. ఎందుకంటే వాళ్ళంటే నాకు భయం. వాళ్ళకు నేనంటే కోపం. పరీక్షల్లో వాళ్ళకు నేను సాయం చెయ్యలేదట. ఆమాట వాళ్ళే నాతో అన్నారు.

నేను ట్యూషన్ చెప్పిన ఆఫీసరుగారింటికి వెళ్ళవద్దామనుకున్నాను. కాని నాకు సిగనిపించినది' ఇద్దరుపిల్లలలో వొపిల్ల పెళ్ళి చేసుకుని అత్తారింటికి వెళ్ళిపోయింది. ఇంకో పిల్లతో మళ్ళీ కనపడను అని చెప్పరావచ్చు. ఏం? యెందుకు? హటాత్తుగా ఏకథలోలాగానో యే రైల్వే స్టేషన్ వెయిటింగు రూములోనో, యే ప్రయాణంలోనో, బస్

## "మంజుశ్రీ"

లోనో, రైల్లోనో, యే థియేటరులోనో కలుసుకోవచ్చును.

ఇది జీవితం. ఏమీ ఆశ్చర్యపడనక్కర లేదు.

అప్పుడు ఒకరినొకరు గుర్తించగలిగితే
ముందు "బావున్నారా?"
తరువాత "యేంచేస్తున్నారు?"
"పిల్లలెంతమంది?"
"పూర్తిగా మారిపోయారండీ!"
"కనుక్కోలేకపోయాను!"
వగైరా వగైరా......లతో పలకరించుకుంటారు.

పైకి అనరు. కాని లోపల "ఆ రోజులెంతమధురంగా వుండేవి, సమస్యలు లేకుండా. ఎప్పుడూ రాబోయే రోజులపై ఆశ. యేమిటో తీపి. కలలు. అర్ద్రత. ఏమిటో ఏమిటో, ఎందుకో ఎందుకో... ఒక్కొక్కరోజే గడచిపోతుంటే బొత్తిగా దిగులుపడటం మానేసి కొత్త ఉత్సాహం. సంతోషం. కాని ఇప్పుడు ఒక్కొక్కరోజే గడుస్తుంటే దిగులు. ఎందుకు? కొత్త లోకపు తలుపులు యెప్పుడు తెరుస్తారో. ఎప్పుడైనా తెరవచ్చును. అప్పుడు వెళ్ళిపోవాలి, మరి." అనుకుంటారు.

ఆఫీసరుగారింటి ముందుగానే నడచిపోయాను.

పంపుదగ్గర నుంచి నీళ్ళు తెస్తున్నది.

నన్ను గుర్తించలేదు, నేను గుర్తించాను. ఆమాత్రం గుర్తించకపోతే నేను మేష్టరుని యెలా అవుతాను?

సంధ్య వాలిపోయింది. వెలుతురుపోయి మరోలోకంలో విచ్చుకుంటున్నది. పడమరవేపు ఆకాశం ఎఱ్ఱగా, భయంకరంగా, అందంగా, ఆలోచించగలిగిన వాడికో కొత్త అనుభూతినిస్తూ అవుపిస్తోంది.

నిలవేసి ఎక్స్ క్యూబ్ ప్లస్ వై క్యూబ్‌కి ఫాక్టర్లు చెప్పమంటే—హడలిపోతుంది.

ఎందుకో యీ చదువులు. మనసుకి అశాంతి తెచ్చిపెట్టేను.

అర్థంకావు. పరీక్ష తప్పితే యేడుపు.

జీవితంలో యెలా వుపకరించేను?

సత్పురుషులని యెలా పట్టుకుంటే యేమో—సీతాకోక చిలుక అవసలు కంఠస్థం పట్టటమెందుకు? బల్లి గోడపై యెలా ప్రాకును? గోధుమ పంటకు అనువైన శీతోష్ణ స్థితులెవ్వి. పరాపరి, సరళరేఖలు, లాభనష్టాలు, ది బాయ్ స్టుడ్ ఆన్ ది బర్నింగ్ డెక్, యెందుకు? చదువుకి అర్థంలేదు. జీవితంలో యెందుకూ పనికిరావు.

రేపు సంసారంలో మనసుకి మనసు అర్థంకాక, అసంతృప్తి, అశాంతి, వైరాగ్యం, చుట్టుముడితే, మనిషిలా బ్రతికేందుకు, హృదయాన్ని ఇంకా ఇంకా విశాలపరుచుకునేందుకు, వొక సుందర సత్యం యీ ధరిత్రిని జయిస్తుంది అని ఆశపడేందుకు అనువైన చదువు యేదయినా వుంటే నలుగురు పెద్దలూ చేరి ఆలోచించి, తెచ్చి పెట్టకూడదూ? ఇన్నాళ్ళూ నేను చేసిందేమిటి? వాళ్లు చేస్తున్నదేమిటి? మేష్టరు పనికిరాని వాళ్లలో మొదటి రకం. వీళ్ళలో నే ఈర్ష్యలు, ద్వేషాలు, కపటాలు, కార్పణ్యాలు, యెక్కువ. వీళ్ళకెవరు చదువు చెపుతారు? వీళ్ళేం చెపుతారు?

వెళ్ళిపోయిందా ఆ అమ్మాయి. పలకరించను. ముందుకు సాగిపోయినాను.

ఎప్పుడూ యెవరితోనూ చెప్పుకోలేను. నవ్వుతారేమోనని భయంవేసి. దూరంగా వొకదాని పక్కనే వొకటి రెండు చిన్న కొండలు. ఆ రెండుకొండలనడుమ సాయంకాలంపూట సూర్యుడు అస్తమిస్తుంటే, ఆ సూర్యుడు భూదేవి నొసటి కుంకుమగానూ, ఆ రెండుకొండలూ ఆమె...... స్ఫురించేవి.

వెళ్ళిపోతున్నాను. ఈతలపు గుప్తంగా నా హృదయంలో దాగి వుంటుంది

(63-వ పేజీ చూడండి)

(16-వ పేజీ తరువాయి)

ఎప్పటికీ.

పట్టాలు దాటివచ్చేశాను.

ఇంటికి వచ్చేసరికి వేపచెట్టు క్రింది అరుగులమీద నలుగురైదుగురు మేష్టర్లూ, పది మంది పిల్లకాయలూ సమావేశమై మాట్లాడుకుంటున్నారు.

వెన్నెల్లో వేపచెట్టు మెరిసిపోతున్నది.

"మళ్లీ యెప్పటికైనా యీ వేపుకి రాండి మేష్టారు" అన్నారు పిల్లకాయలు.

'వస్తాను' అని చెప్పాను. వెళ్ళిపోతున్నాను కాబట్టి వాళ్ళకు కూడా కోపం పోయింది. అవును మరి వెళ్లిపోతున్న వాళ్ళను చూస్తే ఏ సందర్భంలో నైనా యెవరికైనా ఆర్ద్రత కలుగుతుంది.

పిల్లకాయలు వెళ్ళిపోయారు.

అందరూ సిగరెట్లు ముట్టించారు మేష్టర్లు. మంచుపడుతోంది. అయినా యెంతో సేపు యెన్నెన్నో విషయాలు, మంచివి, అసహ్యమైనవి మాట్లాడారు. కూచుని విన్నాను. ఏమీ మాట్లాడలేదు. ఎందుకు నేను వెళ్ళిపోతున్నాను, వీళ్ళను వదిలించి: వీళ్ళు నన్ను కొంత బాధపెట్టారు. మంచుకురుస్తున్నది. వీళ్ళు మంచివాళ్లే. అయితే బలహీనులు. నేనుమాత్రం. నేనూ అంతే - ఇప్పుడా ఆ అమ్మాయి ఏమని ఆలోచిస్తూ వుంటుంది.

కాసిన్ని పద్మగన్నేరు పూలు కోసుకొచ్చుకుంటే బావుండును.

ఈ వెన్నెల్లో, ఈ మంచులో.

పన్నెండు గంటలకి మేష్టర్లంతా వెళ్ళిపోయారు.

ఆరుబయట పడుకున్నాను. వెన్నెలంటే నాకు ఇష్టం. మంచుకురుస్తోంది. పక్కంతా చలపడింది. అయినా అలాగే పడుకున్నాను. ఒకమంచిని అనుభవించేందుకు ఒక చెడును కూడా భరించాలి. వెన్నెలంటే నాకు ఇష్టం. అందుకని మంచును కూడా భరించాల్సిందే. పామల్లన్నీ సాయంకాలమే పిల్లకాయలు పట్టిపోయినారు.

మూడుగంటలప్పుడు హెడ్మాష్టరుగారి వద్దనుంచి ప్యూన్ వచ్చిలేపాడు. ఆయన కూడా పక్కవూరికి వస్తారట.

స్టేషనుకి చేరుకునేసరికి మూడున్నరైంది. స్టేషన్ నిద్రలేవటానికి అప్పుడే ప్రయత్నిస్తోంది.

కుర్చీలూ, బల్లలూ అన్నీ నిద్రపోతున్నాయి.

దూరంగా వెన్నెల మంచుతో కలిసి దగ్గిరగా వెన్నెల చలి.

మూడువందల మైళ్లనుంచీ రైలువస్తుంది.

వందమైళ్లు ఇక్కడినుంచి నడిచిన తర్వాత నేను దిగుతాను.

స్టేషన్లో కాంటిన్ టీవదర్యకు వూనుకుంది.

రైలువచ్చింది, రైలుకదిలింది.

దూరంగా వెన్నెల మంచులో ఊరు మసకబడి పోయింది.

చెక్కల వంతెన. చిటికేశ్వరపుచెట్లు, రెండుకొండలు, అనుభూతులు. అనుభూతులు దూరంగా దూరంగా, వెనక్కు, రైలు ముందుకూ పోతూ వేవుంది. తెల్లవారుతుంది. సూర్యుడుదయిస్తాడు. మంచు విచ్చుకుంటుంది. మళ్ళీ మామూలు ప్రపంచంలోకి మామూలు మనిషిగా మామూలుగా నే వెళతాను. కాని యీ గడచిన మంచు కురిసిన రాత్రి. ★

## మెదడుకు మేత

రాముఁ డెవ్వానిచే రావణు మర్దించె?
వరవానుదేవుని పట్నమేది?
రాజమన్నారుచే రంజిల్లుకరమేది?
వెలయఁ గానుక వంట విత్తదేది?
అలరంభ కొప్పులో నలరు పూదండేది?
వరవారి నవ్వించు జాణ యెవరు?
సీత పెండ్లికి నోలి చేసిన విల్లేది
శ్రీకృష్ణుఁ డేయింటఁ జెలఁగుచుండు
అన్నిటికిఁ జూడ నైదేసి యక్షరములు
ఈవలావల కూడిన యేకవిధము
చెప్పునాతడు భావజ్ఞశేఖరుండు
చెప్పలేకున్న నగుదు మీ చిన్ననగవు.

జవాబులు

లోకమూకలో, రంగనగరం,
లకోలకోల, జంబీరబీజం,
మందారదామం, వికటకవి,
వందావ్యదావం; నందవదనం.

—అయ్యగారి సుబ్రహ్మణ్యం